JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 13-03-2026
Medchal - Malkajgiri । Friday 13-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 286
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 286 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




కోకాపేటలో మెడికవర్ ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ప్రారంభించాను. వైద్యం యాంత్రికంగా ఉండొద్దు అన్నది వైద్యులకు నా సూచన. ప్రజలకు మానవత్వంతో కూడిన వైద్య సాయం అందించడం ప్రతి వైద్యుడు కర్తవ్యం గా భావించాలి. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం మా ప్రభుత్వ ప్రాధాన్యతలు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితం గా లేదా 50 శాతం రాయితీతో రవాణా సౌకర్యం కల్పిస్తాం. ఆడబిడ్డల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. మహిళల ఆరోగ్యం బాగుంటే కుటుంబం బాగుంటుంది. 65 లక్షల మంది హెల్త్ డేటా ను తయారు చేస్తున్నాం. వాళ్ళకి డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తాం. గత 20 ఏళ్ల ఆరోగ్య శ్రీ డేటా ను విశ్లేషించి హెల్త్ డేటా తయారు చేస్తున్నాం. క్యాన్సర్ పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. డాక్టర్ నోరి దత్తాత్రేయను సలహా దారుడిగా నియమించాం. ఆరోగ్య శ్రీ, CMRF కోసం 1800 కోట్లు ఖర్చు చేశాం. ఉస్మానియా, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం 10 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ప్రైవేట్ రంగం లో ఉన్న డాక్టర్ లు ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించాలన్నది నా సూచన.

-- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


## మానవత్వంతో చికిత్స చేస్తేనే ఆస్పత్రులు

- డాక్టర్లపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది
- యాంత్రికంగా సాగుతున్న విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాం
- మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కార్పొరేట్ వైద్యులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా, ఆరోగ్య భద్రత అందించాలని ఆలోచన చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. "విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలను నూతన చాలెంజ్ కింద రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. పేదలకు సరైన విద్య, వైద్యాన్ని అందించినప్పుడు దాదాపు 90 శాతం సమస్యలను పరిష్కరించగలిగినట్టే. అందుకే జీవిత బీమా, ఆరోగ్య భద్రత అందించాలనుకుంటున్నాం" అని చెప్పారు. హైదరాబాద్ కోకాపేట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ప్రారంభించారు. ...మిగతాది 2 లో

## అమెరికా, ఇజ్రాయెల్ తో యుద్ధం ఇరాన్ మహిళలు పాల్గొంటున్నారా?





- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సృష్టించిన నకిలీవని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ ఫ్యాక్ట్ చెక్ బృందం స్పష్టం
- వాస్తవానికి, ఇరాన్ చట్టాల ప్రకారం మహిళలకు సైన్యంలో పోరాట బాధ్యతలు (కంబాట్ రోల్స్) చేపట్టే అనుమతి లేదు

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 12 :

ఇరాన్‌ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ విపరీతంగా వైరల్ అవుతోంది. ఇరాన్ మహిళలు సైనిక దుస్తుల్లో యుద్ధానికి సిద్ధమైనట్లు చూపిస్తున్న వీడియోలు కోట్లాది వ్యూస్ సాధిస్తున్నాయి. అయితే, ఈ వీడియోలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సృష్టించిన నకిలీవని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ ఫ్యాక్ట్ చెక్ బృందం స్పష్టం చేసింది. తత నెల నుంచి టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో ఈ వీడియోలు వెల్లువెత్తాయి. సైనిక దుస్తుల్లో ఉన్న మహిళలు, "హబీబి, ఇరాన్‌కు రా" అంటూ అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీబీసీ పరిశీలనలో ఈ వీడియోలను పోస్ట్ చేస్తున్న ఖాతాలన్నీ గత నెలలోనే సృష్టించినట్లు తేలింది. యూజర్‌నేమ్‌లు, ప్రొఫైల్ ఫొటోలు, క్యాప్షన్‌లు దాదాపు ఒకేలా ...మిగతాది 2 లో

## గ్యాస్ సంక్షోభం మధ్య పుకార్లు వ్యాప్తి



- దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచన..!

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 12 :

ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధం మధ్య, దేశంలోని చాలా ప్రాంతాలలో గ్యాస్ కొరత పెరుగుతోంది. LPG సిలిండర్ల కోసం పొడవైన లైన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని ప్రధాని మోదీ తన మంత్రులను ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సన్నాహాలు బలంగా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని ప్రధాని మోదీ గురువారం (మార్చి 12) తన మంత్రులను కోరినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితిపై భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వారిని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు సోషల్ మీడియాలో కూడా చురుగ్గా ఉండాలని సూచించారు. ...మిగతాది 2 లో




## వడగాల్పులతో మరణించడానికి వీల్లేదు

- వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం
- ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులు యుద్ధ ప్రాతిపదికన జరగాలి
- ఇక పై జిల్లా కలెక్టర్లు కూడా పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం
- నిర్ణీత సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం స్పష్టం

జయభేరి, విజయవాడ, మార్చి 12 :

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా ...మిగతాది 2 లో

2 లో

## 13 ఏళ్ల నరకయాతనకు సుప్రీం విముక్తి

## కవితకు లీగల్ నోటీసులు

- ఛార్జ్‌షీట్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా 23 మందిని ఈ కేసు నుండి విముక్తి కల్పిస్తూ క్లీన్‌చిట్
- ఢిల్లీ లిక్కర్ పాలసీలో అవకతవకలు జరిగాయని, 'సౌత్ గ్రూప్' తరపున కవిత కీలక పాత్ర పోషించారనే ఆరోపణలతో దర్యాప్తు



జయభేరి, హైదరాబాద్, మార్చి 12 :

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ఎమ్మెల్సీ కవిత నివాసానికి సీబీఐ అధికారులు చేరుకుని హైకోర్టు నోటీసులు అందజేశారు. కింది కోర్టు ఇచ్చిన క్లీన్‌చిట్‌ను సవాలు చేస్తూ సీబీఐ దాఖలు ...మిగతాది 2 లో

## ఉప ఎన్నికలు లేనట్లేనా..?

పార్టీలకు ఊరట కలిగేనా ..?

- ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లిన్ చిట్
- ఇంతటితో పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్ కు ఎండ్ కార్డు పడే ఛాన్స్ ఉందా లేక ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటాయా..



2 లో

మొదటిపేజీ తరువాయి

## మానవత్వంతో చికిత్స చేస్తేనే..

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మహిళలు అత్యధికంగా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున రాష్ట్రంలోని 65 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాం. గడిచిన రెండేళ్లలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, CMRF కింద 1800 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు పెట్టాం. ఉస్మానియా, వరంగల్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, సనత్ నగర్ టిమ్స్, నిమ్స్.. ఆసుపత్రుల్లో దాదాపు 10 వేల కోట్లు ఖర్చు చేసి 10 వేల పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నాం. విద్య ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు చేరినప్పటికీ నాణ్యమైన విద్య అందడం లేదు. యాంత్రికంగా సాగుతున్న విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాం. నైపుణ్యత మెరుగుపర్చుకోకుంటే, ప్రపంచంతో పోటీ పడలేం. అందుకే విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టాం. ఒక పాలసీ తీసుకొచ్చాం. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించాలని కొత్త కాన్సెప్ట్‌తో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ విధానం తీసుకొస్తున్నాం. ఇప్పటివరకు 10 వ తరగతి తర్వాత ఇంటర్ విధానం కొనసాగుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12 వ తరగతి పాఠశాల విద్య కింద తీసుకొస్తున్నాం. పాఠశాలల్లో ఉదయం నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించాం. కార్పొరేట్ స్కూల్స్ తరహాలోనే విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం ఖర్చుతో రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కోర్ అర్బన్ రీజియన్‌లో నూతన విధానం ప్రవేశపెట్టాలని భావిస్తున్నాం. ఏఐ రావడం వల్ల టెక్నాలజీ రంగంలో వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయంగా మారొచ్చునేమో, కానీ బ్లూ కాలర్ జాబ్స్‌ని ఏఐ రిప్లేస్ చేయలేదు. స్కిల్స్ లేని కారణంగా ప్రతి ఏటా రాష్ట్రం నుంచి 1.10 లక్షల ఇంజనీరింగ్ గ్యాడ్యుయేట్లు ప్రపంచంతో పోటీ పడలేని పరిస్థితి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభించాం. టాటా కన్సల్టెన్సీ సహకారంతో పురాతన ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా మార్చాం. తర్వాత దశలో పాలిటెక్నిక్ కాలేజీలను కూడా ఈ విధానంలోకి తెస్తాం. కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యత కింద సంవత్సరంలో నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు సేవలు అందించాలి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఒక వేదిక సృష్టించబోతోందని, విదేశాల్లో ఉన్న మన వైద్యులతో పాటు ఇక్కడ కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు కూడా ముందుకు రావాలి. వైద్యం యాంత్రికంగా చేసే వృత్తి కాదు. పేదలకు, కష్టాల్లో ఉన్నవారికి మానవత్వంతో కూడిన వైద్య సహాయాన్ని అందించినప్పుడే రోగులకు వారి కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. ఆసుపత్రుల్లో వైద్యులు వ్యవహరించే తీరు, నిర్వహించే విధానమే రోగుల సగం సమస్యలను పరిష్కరిస్తుంది. దేశంలో 25 వ మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషం. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ హాస్పిటల్ మరింతగా రాణించాలి" అని అభిలషించారు.

## ఇరాన్ మహిళలు పాల్గొంటున్నారా?

ఉండటంతో ఇదొక ప్రణాళికాబద్ధమైన ప్రచారంగా గుర్తించారు. వాస్తవానికి, ఇరాన్ చట్టాల ప్రకారం మహిళలకు సైన్యంలో పోరాట బాధ్యతలు (కంబాట్ రోల్స్) చేపట్టే అనుమతి లేదు. కేవలం పురుషులకు మాత్రమే సైనిక సేవ తప్పనిసరి. అంతేకాకుండా, 1979 విప్లవం తర్వాత అమల్లోకి వచ్చిన హిజాబ్ చట్టం ప్రకారం మహిళలు బహిరంగ ప్రదేశాల్లో తమ శరీరాన్ని, జుట్టును కప్పుకోవాలి. వైరల్ వీడియోల్లో మహిళలు హిజాబ్ లేకుండా కనిపించడం ఇరాన్ వాస్తవ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధం. ఈ ట్రెండ్‌ను గుర్తించిన టిక్‌టాక్, తమ నిబంధనలను ఉల్లంఘించిన 52 ఖాతాలను తొలగించింది. కేవలం వ్యూస్, ఆదాయం కోసమే కొందరు యూజర్లు ఈ ట్రెండ్‌ను వాడుకుంటున్నారని, దీని వెనుక ఎలాంటి రహస్య ప్రచార ఉద్దేశాలు లేవని టిక్‌టాక్ పేర్కొంది. ఇదే సమయంలో, ఇరాన్ క్షిపణులు టెల్ అవీవ్‌పై పడుతున్నట్లు చూపించిన మరో వీడియో కూడా నకిలీదని రాయిటర్స్ కథనం ప్రకారం ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారించారు.

## గ్యాస్ సంక్షోభం మధ్య పుకార్లు వ్యాప్తి

అలాగే ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పేర్కొన్నారు. మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చిన ప్రధాని మోదీ, "ఇలాంటి ప్రచారాలకు ప్రతిస్పందించేటప్పుడు మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలి. ఇది ఒక దేశాన్ని మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితి" అని అన్నారు. ఎలాంటి సంక్షోభానైనా ఎదుర్కొనేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని, ఇందుకు సన్నాహాలు చాలా బలంగా ఉన్నాయని ఆయన అన్నారు. మన పొరుగువారి కంటే, అనేక ఇతర దేశాల కంటే భారతదేశం బలంగా, మెరుగ్గా ఉందన్న విషయం ప్రజలకు వివరించాలని ప్రధాని తెలిపారు. అంతకుముందు, బుధవారం తమిళనాడులో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, ప్రజలు భయపడవద్దని, ప్రజా ప్రయోజనాలను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడులో జరిగిన నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. వాణిజ్య ఎల్పీజీ కొరత దేశంలోని హోటల్ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఎల్పీజీ సంక్షోభానికి త్వరిత పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. గ్యాస్ సంక్షోభాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, సరైన, ధృవీకరించిన సమాచారాన్ని మాత్రమే వ్యాప్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, హోర్ముజ్ జలసంధి ద్వారా అంతర్జాతీయ నౌకా రవాణాను మూసివేయడానికి లేదా అంతరాయం కలిగించడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాల మధ్య భారతదేశం ఒక పెద్ద పురోగతిని సాధించింది. ఈ సముద్ర మార్గం ద్వారా నౌకల కదలికకు సంబంధించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తన ఇరాన్ ప్రతినిధి అబ్బాస్ అరఘ్చితో ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. చర్చల తర్వాత, ఇరాన్ భారతదేశం కోసం హోర్ముజ్ జలసంధిని తెరవడానికి అంగీకరించింది. ఇరాన్ ఇప్పుడు భారత జెండా కలిగిన ట్యాంకర్లను దాని గుండా వెళ్ళడానికి అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే సౌదీ అరేబియా నుంచి ముడి చమురును మోసుకెళ్తున్న లైబీరియన్ జెండా కలిగిన ట్యాంకర్ ముంబై తీరానికి సురక్షితంగా చేరుకుంది. ప్రస్తుతం పుష్పక్, పరిమల్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు జలసంధిని సురక్షితంగా దాటుతున్నాయి.

## కవితకు లీగల్ నోటీసులు

చేసిన అప్పీల్‌పై కోర్టు ఈ నోటీసులు జారీ చేసింది. గతంలో 164 రోజుల పాటు తిహార్ జైలులో ఉన్న కవిత.. ఇటీవలే విముక్తి పొందారు. తాజాగా సీబీఐ ఈ కేసులో విచారణను వేగవంతం చేయడంతో రాజకీయ వర్గాల్లో మళ్ళీ ఉత్కంఠ నెలకొంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల ఊరట లభించిందనుకున్న మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మళ్లీ చట్టపరమైన చిక్కులు మొదలయ్యాయి. ఈ కేసులో కవిత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌పై ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాసేపటి క్రితం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో ఉన్న కవిత నివాసానికి చేరుకున్న సీబీఐ అధికారులు.. ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన తాజా నోటీసులను అందజేశారు. ఆ సమయంలో కవిత ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో.. నోటీసులను ఆమె భర్త అనిల్ కుమార్‌కు అందజేసి, ఆమె ఎక్కడ ఉన్నారనే వివరాలను ఆరా తీశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీలో అవకతవకలు జరిగాయని, 'సౌత్ గ్రూప్' తరపున కవిత కీలక పాత్ర పోషించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థలు విచారణ జరిపాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా 23 మందిని ఈ కేసు నుండి విముక్తి కల్పిస్తూ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ తీర్పును సీబీఐ హైకోర్టులో సవాలు చేయడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. మార్చి 15, 2024న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి, సాయంత్రం వేళ ఆమెను అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించారు. ఈడీ కస్టడీలో, ఆ తర్వాత సీబీఐ అరెస్ట్ చేయడంతో కవిత సుమారు ఐదున్నర నెలల పాటు తిహార్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. సుప్రీం కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో ఊపిరి పీల్చుకున్న కవితకు.. సీబీఐ హైకోర్టును ఆశ్రయించడం కొత్త తలనొప్పిగా మారింది. ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్న ఆధారాలను మరోసారి పరిశీలించాలని, కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని సీబీఐ పట్టుబడుతోంది.

# 13 ఏళ్ల నరకయాతనకు సుప్రీం విముక్తి..



సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కారుణ్య మరణాలు ఇటీవల పెరుగుతున్నాయి. కారణం ఏదైనా కారుణ్య మరణం కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. విచారణ తర్వాత చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే కొన్నింటిని మాత్రం కోర్టు కూడా అంగీకరిస్తోంది తాజాగా 13 ఏళ్లుగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం అనుమతించడం భారత న్యాయ చరిత్రలో చారిత్రాత్మక సంఘటనగా నమోదైంది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించడానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశంలో ఈ విధానానికి మొదటి సారి ఇచ్చిన అనుమతి. ఓ మనిషి కారుణ్య మరణానికి అనుమతినిచ్చింది. 12 సంవత్సరాలకు పైగా కోమాలో ఉన్న 31 ఏళ్ల వ్యక్తికి సుప్రీంకోర్టు బుధవారం పాసివ్ యుథనేషియా మంజూరు చేసింది. అతని కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించాలిన సుప్రీంకోర్టు ఆదేశించింది. పాసివ్ యుథనేషియా అనేది ఒక రోగిని ఉద్దేశపూర్వకంగా ప్రాణాలతో ఉంచడానికి అవసరమైన లైఫ్ సపోర్ట్. ఇతర చికిత్సను నిలిపివేయడం ద్వారా చనిపోవడానికి అనుమతించే ప్రక్రియ. ఘజియాబాద్‌కు చెందిన 31 ఏళ్ల హరీష్ రాణాకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిష్క్రియాత్మక కారుణ్య మరణాన్ని మంజూరు చేసింది. తన కొడుకు మరణాన్ని కోరుతూ తండ్రి సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నాడు.

న్యాయమూర్తులు జెబి పార్దివాలా, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. అనాయాస మరణం కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ, జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "దేవుడు మనిషిని జీవితాన్ని అంగీకరిస్తున్నాడా లేదా అని అడగడు, జీవితాన్ని అతనే తీసుకోవాలి." అని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా మంచం పట్టిన 31 ఏళ్ల హరీష్ రాణాకు ఇప్పుడు కారుణ్య మరణం మంజూరు కానుంది. గౌరవప్రదమైన మరణ హక్కును గుర్తిస్తూ 2018 కామన్ కాజ్ నిర్ణయం తర్వాత కారుణ్య మరణం అనేది మొదటి న్యాయపరమైన నిర్ణయం. తన తీర్పును వెలువరించే ముందు, హరీష్ కోలుకునే అవకాశం లేదని తేల్చిన రెండు కోర్టు నియమించిన వైద్య బోర్డుల నివేదికలను ధర్మాసనం పరిశీలించింది. ఘజియాబాద్‌లోని రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివసించే హరీష్ తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం, అతను 12 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. అతనికి ద్రవ ఆహారం మాత్రమే ఇస్తున్నారు. 2013లో తన ఇంటి నాల్గవ అంతస్తు నుంచి పడిపోవడంతో హరీష్ రాణా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దశాబ్ద కాలంగా కోమాలో ఉన్నాడు. వైద్య చికిత్సను ఉపసంహరించుకునేలా హరీష్‌ను పాలియేటివ్ కేర్‌లో చేర్చాలని ధర్మాసనం ఎయిమ్స్‌ను ఆదేశించింది.

అతని గౌరవాన్ని కాపాడుకోవడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఈ ఉపసంహరణ చేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. తీర్పు వెలువరించే ముందు హరీష్ రాణా తల్లిదండ్రులను కలవాలని సుప్రీంకోర్టు కోరిక వ్యక్తం చేసింది. ఢిల్లీకి చెందిన ఎయిమ్స్‌కు చెందిన సెకండరీ మెడికల్ బోర్డ్ ఆఫ్ డాక్టర్లు దాఖలు చేసిన హరీష్‌రాణా మెడికల్ రిపోర్టుతో కూడిన నివేదికను చూసి, అది విచారకరమైన నివేదిక అని పేర్కొంది. రోగి పరిస్థితిని పరిశీలించిన తర్వాత, ప్రాథమిక వైద్య బోర్డు అతను కోలుకునే అవకాశం చాలా తక్కువ అని తేల్చి చెప్పింది. డిసెంబర్ 11న, ప్రాథమిక వైద్య బోర్డు నివేదిక ఆ వ్యక్తి పరిస్థితి చాలా విషమంగా ఉందని సూచించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 2023లో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, రోగికి కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించడంపై నిపుణుల అభిప్రాయాన్ని పొందడానికి ప్రాథమిక, ద్వితీయ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడం తప్పనిసరి అయ్యింది.

అరుణాకు కారుణ్య మరణం అనుమతించాలని జర్నలిస్ట్ పింకీ విరాణి సుప్రీంకోర్టులో 2011లో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు చికిత్సను నిలిపివేసి సహజ మరణం (పాసివ్ యూతనేషియా) అనుమతించాలని నిర్ణయించింది, కానీ బాధితుడి తల్లిదండ్రులు, భాగస్వామి లేదా సన్నిహితుల అనుమతి తప్పనిసరిగా నిర్దేశించింది. 'నెక్సట్ ఫ్రెండ్'గా పింకీని నిరాకరించి, ఆసుపత్రి సిబ్బందిని సూరిగా నియమించింది, వారు చికిత్స నిలిపివేయడానికి ఒప్పుకోకపోవడంతో పిటిషన్ తిరస్కరించబడింది. నాలుగు దశాబ్దాలుగా జీవచ్ఛవం వల్ల ఉన్న అరుణా 2015లో న్యుమోనియాతో మరణించిందిఅరుణా కేసు ఆధారంగా 2018లో సుప్రీంకోర్టు 'గౌరవప్రద మరణం'ను ప్రాథమిక హక్కుగా గుర్తించి పాసివ్ యూతనేషియాను అధికారికంగా చట్టబద్ధం చేసింది. హరీశ్ రాణా (ఇంజినీరింగ్ విద్యార్థి) 2013లో చండీగఢ్ యూనివర్సిటీ హాస్టల్ నాలో అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయి తలకు తీవ్ర గాయం కారణంగా 13 ఏళ్లు కోమాలో ఉన్నాడు. తల్లిదండ్రులు సుప్రీంకోర్టుకు అనేక సంవత్సరాలు పిటిషన్ చేసిన తరువాత, వైద్య నివేదికల ఆధారంగా మార్చి 2026లో చికిత్స తొలగించడానికి అనుమతించింది, ఇది అరుణా మార్గదర్శకాల ప్రకారం మొదటి సారిగా ఇచ్చిన తీర్పు ప్రస్తుత కేసులో చికిత్స నిలిపివేత ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం తన నిర్ణయంలో పేర్కొంది.

ప్రాథమిక , ద్వితీయ బోర్డులు నిలిపివేతను నిర్ధారించిన తర్వాత, కోర్టు జోక్యం అవసరం లేదు. ఇది మొదటిది కాబట్టి, ఈ విషయాన్ని కోర్టుకు సూచించడం సముచితంగా పరిగణించకూడదని ధర్మాసన పేర్కొంది. రోగులకు చికిత్స నిలిపివేత ప్రక్రియ మానవీయంగా ఉండాలి, దీనికి ఒక క్రమబద్ధత అవసరమని సుప్రీంకోర్టు తెలిపింది.

## వడగాల్పులతో మరణించడానికి వీల్లేదు

అమలు చేయాలన్నారు. వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలను ప్రమోట్ చేయండి

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కేవలం సంబంధిత శాఖల పనే కాదని, ఇకపై జిల్లా కలెక్టర్లు కూడా పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడిదారులను గుర్తించి, ఒప్పించి, వారికి అన్ని విధాలా సహకరించేందుకు 'కమిట్‌మెంట్, కన్విన్స్, కోఆపరేట్' అనే 3సీ ఫార్ములాను ఆయన నిర్దేశించారు. పెట్టుబడుల విషయంలో కలెక్టర్ల పనితీరును అంచనా వేసి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఆధారంగా ర్యాంకులు ఇస్తామని ప్రకటించారు. అమరావతిలో జరిగిన 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు పెట్టుబడులు, పర్యాటక రంగాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "పెట్టుబడులు వస్తేనే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రజల తలసరి ఆదాయం వృద్ధి చెందుతుంది. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు వేగంగా కార్యరూపం దాల్చేలా చూడాలి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ప్రత్యేక అధికారులకు అప్పగించాం. ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులు యుద్ధ ప్రాతిపదికన జరగాలి" అని ఆదేశించారు. ఓర్వకల్లు, కొప్పర్తి వంటి ప్రాంతాలను ప్రధాన పారిశ్రామిక హబ్‌లుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదని, అమర్ రాజా వంటి సంస్థలను కూడా వేధించి పంపించారని చంద్రబాబు విమర్శించారు. "గతంలో మేం హైదరాబాద్‌ను మోస్ట్ లివబుల్ సిటీగా, పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాం. ఇప్పుడు అదే తరహా ఎకో సిస్టమ్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్నాం" అని వివరించారు.

మంత్రులకు రేటింగ్స్

సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మాటలతో కాకుండా, ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎంత వేగంగా క్లియర్ అవుతున్నాయనే అంశంపై సీఎం స్వయంగా 'గణాంకాలతో కూడిన రేటింగ్స్' ప్రకటించడం విశేషం. పాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ఈ విశ్లేషణ సాగింది. ముఖ్యమంత్రి వెల్లడించిన నివేదిక ప్రకారం, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందరికంటే వేగంగా ఫైళ్లను పరిష్కరిస్తూ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన పనితీరుపై సీఎం ప్రశంసలు కురిపించారు. అచ్చెన్నాయుడు తర్వాత వరుసగా మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉత్తమ రేటింగ్స్‌తో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే, కీలకమైన హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న వంగలపూడి అనిత ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరికంటే చివరి స్థానంలో నిలవడం గమనార్హం. ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వల్ల పరిపాలన కుంటుపడుతుందని, నిర్ణీత సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. మంత్రులందరూ తమ శాఖల్లో ఫైళ్ల కదలికపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు సేవలు అందించడంలో జాప్యం సహించబోమని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు.



# ఉప ఎన్నికలు లేనట్లేనా..?

### పార్టీలకు ఊరట కలిగేనా ..?

- **ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లిన్ చిట్**
- **ఇంతటితో పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్ కు ఎండ్ కార్డు పడే ఛాన్స్ ఉందా లేక ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటాయా..**

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో పది మంది ఎమ్మెల్యేల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లిన్ చిట్ ఇచ్చారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు లేనట్లే అని క్లారిట వచ్చింది. దీంతో రాజకీయ పార్టీలకు రిలీఫ్ అన టాక్ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిపై అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ సుప్రీం కోర్టులో పిటీషన్ వేసింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, ప్రకాష్ గౌడ్ అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్, కాలే యాదయ్య, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే వీరిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ తొలుత హైకోర్టు, తర్వాత సుప్రీం కోర్టు వరకు వెళ్ళింది. దీంతో సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనల అనంతరం మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని స్పీకర్ కు డైరెక్షన్ ఇచ్చింది. ఇక స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి విచారణ చేసి తుది తీర్పును ప్రకటించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన పది చోట్ల ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ ప్రచారం చేసింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించిన సందర్భంలో కేటీఆర్ పదే, పదే ఇదే అంశాన్ని చెప్పారు. కానీ స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడంతో ఉప ఎన్నికలు లేనట్లే అని స్పష్టత వచ్చింది. బిఆర్ఎస్ పైకి ఉప ఎన్నికలకు రెడీ అని చెప్పినప్పటికీ లోలోపల మాత్రం ఉప ఎన్నికలు వస్తే ఎలా అనే ఆందోళన ఉండేది. బిఆర్ఎస్‌తో పాటు బీజేపీ ఇతర ప్రతిపక్ష పార్టీలు సైతం ఉప ఎన్నికలు రాకుండా ఉంటేనే బెటర్ అనే భావనలో ఉన్నాయట. సాధారణంగా ఉప ఎన్నికలు వస్తే రాజకీయ పార్టీలకు ఆర్థికంగా పెద్ద భారం అవుతోంది. పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థుల తరపున ప్రచారం, ఓటర్లకు తాయిలాలు లాంటి అంశాలతో ఉప ఎన్నికలు అంటే భయపడే పరిస్థితి వచ్చింది. సాధారణంగా అధికార పార్టీకి ఉప ఎన్నికలను డీల్ చేయడం పెద్ద కష్టం కాదు. అన్ని వనరులు అధికార పార్టీకి అడ్వాంటేజ్ గా ఉంటాయి. ప్రతిపక్ష పార్టీలకు మాత్రం సవాల్ గా ఉప ఎన్నికలు నిలుస్తాయి. దీంతో ఒకే సారి పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే తమ పరిస్థితి ఏంటి అని ప్రతిపక్ష పార్టీల్లో భయం నెలకొంది. కనీసం ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానంలో అయినా ఉప ఎన్నికలు వస్తాయని భావించారు. కానీ మొత్తం పది మందికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడంతో ఇక ఉప ఎన్నికలు రావని ప్రతిపక్ష పార్టీలు డిసైడ్ అయ్యాయి. మొత్తానికి ఉప ఎన్నికలు వస్తే ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్న రాజకీయ పార్టీలకు స్పీకర్ క్లిన్ చిట్ ఊరట ఇచ్చింది అనే చర్చ జరుగుతోంది. ఇంతటితో పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్ కు ఎండ్ కార్డు పడే ఛాన్స్ ఉందా లేక ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటాయా అనేది చూడాలి.

# నృసింహుని సేవలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- కుటుంబ సమేతంగా శ్రీ నృసింహుడిని దర్శించుకున్న గవర్నర్
- ఆలయ మర్యాదలతో గవర్నర్ కు పూర్ణకుంభ స్వాగతం

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి12 :**



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య గవర్నర్ కు ఆలయ మర్యాదలతో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

**గవర్నర్ కు ఘన స్వాగతం...**

అంతకుముందు.. యాదగిరి పుణ్యక్షేత్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కు రాష్ట్రపతి విడిది గృహం వద్ద ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు,అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఆలయ కార్యనిర్వహణ ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయంలో అర్చన, పూజలు నిర్వహించారు. యాదగిరి గుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి మెమొంటోను అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు.

**స్పటిక లింగానికి గవర్నర్ దంపతుల అభిషేకం**

అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గుండ్లపల్లి స్టేజ్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలి

**జయభేరి, యాదగిరిగుట్ట :**




యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో హైదరాబాదు నుండి యాదగిరిగుట్టకు, యాదగిరిగుట్ట నుండి హైదరాబాదుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు అన్నింటిని గుండ్లపల్లి వద్ద ఆపాలని గురువారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపో సీఐ ప్రవీణ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామం నుండి అనేకమంది విద్యార్థులు భువనగిరిలో ఉన్న కళాశాలలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఉదయం సమయంలో వెళ్లే విద్యార్థులకు,మహిళలు, ప్రజలకు సకాలంలో వారి గమ్య స్థానాలకు వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మీద గంటల తరబడి నిలబడిన బస్సు ఆపే పరిస్థితి లేదని వాపోయారు. చాలాసార్లు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలోనే ఆర్టీసీ బస్టాండ్, డిపో ఉండాలని సిపిఐ ఆధ్వర్యంలో గోదా యాదగిరి నాయకత్వంలో ఆనాడు పోరాటం చేసి సాధించిన బస్టాండ్, గుండ్లపల్లి రైతులు త్యాగాలు చేసి భూములు ఆర్టీసీ బస్టాండ్, డిపోకు ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. కానీ ఆర్టీసీ అధికారులు మాత్రం గుండ్లపల్లిలో బస్సులో ఆపకుండా ప్రజలందరిని చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు, వెంటనే డిపో మేనేజర్ స్పందించి గుండ్లపల్లి స్టేజి వద్ద అన్ని బస్సులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య,ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు,8వ వార్డు కార్యదర్శి ముక్కెర్ల పెంటయ్య, భగత్ సింగ్ యూత్ అధ్యక్షులు కంబాల వెంకటేష్,కంబాల యాదగిరి,తోటకూరి శ్రీశైలం, శెట్టి నరసింహ, కంబాల శ్రీశైలం, సత్యం, బండ రామచందర్, కంబాల రాజు, సంఘీ అరవింద్, కంబాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించేందుకు నూతన సబ్ స్టేషన్ నిర్మించినట్లు తెలిపారు. సబ్ స్టేషన్‌తో తాళ్లగూడెం, బహుపేట, మాసాయిపేట, ధర్మారెడ్డిగూడెం సహా సుమారు 15కుపైగా గ్రామాల రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని తెలిపారు. రైతుల వ్యవసాయ బావులు, మోటార్లు సులభంగా నడుపుకుని సాగు పనులు సకాలంలో నిర్వహించుకునే అవకాశం కలుగుతుందన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,విద్యుత్ శాఖ అధికారులు,స్థానిక నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

- ప్రజా పాలనలో పల్లెల్లో ప్రగతి పరుగులు
- మండలానికి 36 మహిళా సమాఖ్య సంఘ భవనాలు

**జయభేరి, చింతపల్లి, మార్చి 12:**



మండలంలోని దేన్యతండా, బోత్యతండా, బాలాజీ తండా, చింతపల్లి, ధైర్యపురి తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పది లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. అదేవిదంగా నెల్వలపల్లి గ్రామం నుండి మల్లపురాజుపల్లి వరకు 4కోట్ల 75లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు బాలాజీ తండా, చింతపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిదంగా గొడ్డటి మల్లమ్మ రాములు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, ఇంటి యాజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చింతపల్లి శ్రీ గట్టు లక్ష్మి మైసమ్మ మాత దేవాలయాన్ని, కర్మేడ్ శ్రీ గణపతి, సురమాంబ, కంఠమహేశ్వర, రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవాలలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.

మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోందని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రాకపోకలు కల్పించేందుకు బీటి మరియు రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేదోడి గుండెల్లో సంతోషం నింపడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఆశయాలతో నడుస్తున్న ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బ్రతకాలనే లక్ష్యంతో, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 4.5 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొండూరు పవన్ కుమార్, ఎరుకల వెంకటయ్య గౌడ్, ముచ్చర్ల యాదగిరి, లింగంపల్లి వెంకటయ్య, మండల సర్పంచులు కాసారపు శ్వేతా శ్రీనివాస్, ఆవుల నాగేశ్వరి మల్లయ్య, అలివేలు భీమానాయక్, రామావత్ మహేష్, వాంకుడోవత్ అనిత దాసు నాయక్, చెన్నమ్మ లాలయ్య, మాజీ జెడ్పీటీసీలు జంగిటి నరసింహ, హరి నాయక్, రవికుమార్, మాజీ సర్పంచులు కాయితి జితేందర్ రెడ్డి, అంగిరేకుల గోవర్ధన్, దాసరి శ్రీనివాస్ యాదవ్ లు, చందు నాయక్, ఉజ్జిని నరేంద్రరావు, పంబలి వెంకటయ్య, హనుమ నాయక్, వెంకటయ్య, ఎల్లంకి రాధాకిషన్, దాసరి రాజు, గుణమోని కొండల్, కొప్పుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# మాట నిలబెట్టుకున్న గ్రామ సర్పంచ్ రాజేష్

**జయభేరి, చెన్నూర్, మార్చి 12 :**

మంచిర్యాల జిల్లా మండలం కోటపెల్లి సర్వాయిపేట గ్రామం ఎలక్షన్స్ ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటి ఆడబిడ్డ పెళ్లికి నా వంతుగా టెంట్ హౌస్ మండపం ఉచితంగా ఇస్తానని మాట ఇచ్చాను ఇచ్చిన ప్రకారం ఈరోజు గ్రామంలోని డోర్కె లక్ష్మి కిష్టయ్య కూతురు వైష్ణవి మహేష్ వివాహానికి టెంట్ హౌస్ సామాన్ ఉచితంగా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్ మూడో వార్డ్ నెంబర్ పర్వతాలు నాలుగో వార్డ్ నెంబర్ శ్యాం కుమార్ పాల్గొని నూతన ఆశీర్వదించడం జరిగినది.

# తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి విజయవంతం చేయండి

- కుమ్మర శాలివాహన సంఘం కొండమల్లేపల్లి మండల కన్వీనర్ ఏరుకొండ రాము




**జయభేరి, కొండమల్లేపల్లి :**

తొలి తెలుగు కవయిత్రి శ్రీ శ్రీ శ్రీ అతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకను జయప్రదం చేయాలని కొండమల్లేపల్లి మండల కుమ్మర శాలివాహన సంఘం కన్వీనర్ ఏరుకొండ రాము అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కుమ్మరి కులస్తుల అరాధ్యదైవమైన శ్రీ శ్రీ శ్రీ అతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకను కొండమల్లేపల్లి పట్టణంలోని చౌరస్తాలో శుక్రవారం 13 3 2026 ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం లాగా కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి కొండమల్లేపల్లి మండల పరిధిలోని కుమ్మరి శాలివాహన సంఘం ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కుమ్మరి కులంలో పుట్టి 16వ శతాబ్దపు సుప్రసిద్ధ తెలుగు కవయిత్రిగా ఆమె పేరుందారని అన్నారు. 1440 నుండి 1536 సంవత్సరం వరకు 16వ శతాబ్దపు సుప్రసిద్ధ మహిళ కవిగా శ్రీకృష్ణదేవరాయల కాలంలో జీవించారని అన్నారు. సరళమైన మొల్ల రామాయణం తెలుగులో రచించారని అన్నారు. దైవాంశ సంభూతురాలు కావడంతో తొలి తెలుగు కవయిత్రి గా గుర్తింపు పొందారని అన్నారు.



# వృద్ధులకు ఉచిత శీఘ్రదర్శనం కల్పించాలని వినతి

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 12 :**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో వృద్ధులు, దివ్యాంగులు,గర్భిణి స్త్రీలకు ఉచిత ప్రత్యేక శీఘ్ర దర్శనం కల్పించాలని యాదగిరిగుట్ట మండల టాస్కా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టాస్కా బృందం మండల అధ్యక్ష, కార్యదర్శులు ముడుంబై జయ మోహనాచార్య, పులుగం చక్రపాణి మాట్లాడుతూ టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట ఆలయంలో కూడా దర్శనం కల్పించాలని కోరగా ఈవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కొండ కింద పాదాల దగ్గర ఆర్టీసీ రిక్వెస్ట్ బస్టాప్ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, రిక్వెస్ట్ బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాగి సహదేవ్,జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి యాదగిరి, నాయకులు నూకల సుధాకర్ రెడ్డి, గుండ్లపల్లి మల్లేష్ గౌడ్, వెలిశాల బ్రహ్మచారి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాలకు నేడు విద్యుత్ అంతరాయం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ఏపీ ఈపీడీసీఎల్ ఈపీ బోనంగి సెక్షన్ పరిధిలో శుక్రవారం సోమునాయుడుపాలెం, స్వయంభువరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏపీ ట్రాన్స్కో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పైన పేర్కొన్న రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని తెలిపారు.ఈ రెండు గ్రామాల విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఈ ఈ మురళీకృష్ణ కోరారు.

# డ్రగ్స్ గంజాయి వినియోగ దుష్ప్రభావాలపై అవగాహన



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు ఆధ్వర్యంలో వజ్ర ప్రహార్ కార్యక్రమంలో భాగంగా గురువారం దేశపాత్రునిపాలెం గ్రామంలోని జడ్పీ స్కూల్లో ఎస్ఐ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో వివరించబడింది. విద్యార్థులకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలియజేశారు. అలాగే డ్రగ్స్ అలవాటు పడితే విద్య, ఉద్యోగ అవకాశాలు, జీవిత లక్ష్యాలు దెబ్బతింటాయని సూచించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించే వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, సైబర్ మోసాల నుంచి జాగ్రత్తలు తీసుకోవడం, మహిళల భద్రత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ వై వి రమణ, 10 మంది ఉపాధ్యాయులు, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసులు విద్యార్థులకు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన




**జయభేరి, చెన్నూర్, మార్చి 12 :**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమను తాము రక్షించుకోగలరని చెన్నూరు సిఐ బన్సీలాల్ గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడి విద్యార్థులు ఫోక్స్ మత్తు పదార్థాల నియంత్రణ లాంటి కీలక చట్టాల గురించి తెలుసుకోవాలని అపరిచితులతో స్నేహం చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞానానికోసమే వాడాలని తెలిపారు.



## దేవరకద్రలో ప్రకృతి వైద్య శిబిరం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానికుడైన బిలకటి వెంకట్రాములు 50వ వివాహ మహోత్సవ సందర్భంగా వెంకటరమణ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్య శెట్టి, ప్రధాన కార్యదర్శి గుద్దేటి చంద్రయ్య, జిల్లా మరియు పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్, దశరథ, గిరిశంకర్, నరేష్ల అర్జున్, కమలమ్మ తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆది హనుమంత్ రెడ్డి కుమార్తె వివాహానికి గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య సేవలు అందించేందుకు మెగా వైద్య శిబిరాలు ఎంతగానో దోహదం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెగా వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలం పాలెం లో గురువారం వ్యవసాయ శాఖలో పనిచేసి పదవి విరమణ పొందిన జాయింట్ డైరెక్టర్ బి. కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రజలకు వైద్య సేవలు చేయడానికి మెగా వైద్య శిబిరాల నిర్వాహకులు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి వైద్య శిబిరంలో పాల్గొని చికిత్సలు చేయించుకున్నారు. అలాగే చాలామంది రక్తదాన శిబిరంలో పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలం తాటికొండ నెహ్రూ నగర్ లో రాము సాగర్ మరియు మూసాపేట మండలం చక్రాపూర్ లో ఉప్పరి భారతమ్మల ఇందిరమ్మ ఇండ్లను గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అలాగే సంకల్ మధ్యలో కూడా కొమ్ము శ్రీనివాసులు కు చెందిన ఇందిరమ్మ ఇంటిని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలన

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- మహబూబ్ నగర్ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

జయభేరి, దేవరకద్ర :

ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసమే ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అనంత మారుతి గార్డెన్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు.పట్టణాలు, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ గా 5 దశల్లో 5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 2 గ్రామసభలు, గ్రామస్థాయి కార్యక్రమాలు, ఏప్రిల్ 16 మండల స్థాయి కార్యక్రమాలు, మే 2 నియోజకవర్గస్థాయి కార్యక్రమాలు, మే 22 జిల్లా స్థాయి కార్యక్రమాలు, జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను.. ప్రజా ప్రతినిధులు, అధికారులు, అందరం అంకిత భావంతో పని చేసి విజయవంతం చేద్దామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు.ప్రజాపాలనపట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం మరియు ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ & అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం మరియు వ్యవసాయం, విద్య, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో అందరం భాగ్యస్వాములై విజయవంతం చేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మహబూబ్ నగర్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

జయభేరి, దేవరకొండ :

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోని భాగంగా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు అధ్యాపక బృందం కలిసి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరచడం జరిగింది అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ, అధ్యాపక బృందం తెలియజేసినారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన వడ్త్య రమేష్



జయభేరి, కొండమల్లెపల్లి :

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో SPL 2 ఆర్గనైజేషన్ సభ్యులు నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ను BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇరు జట్లు లకు కరచాలనం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల సామాగ్రి అందజేత



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ కస్తూర్బా స్కూల్లో పదో తరగతి 35 మంది విద్యార్థులకు స్పాన్సర్స్ పందిరి వెంకన్న జ్యోతి కుమారులు కేదార్నాథ్, స్నేహాళ్ సముద్రాల ఆనంద్ దివ్య పరీక్షల సామాగ్రి కిట్టు దేవరకొండ వాసవి క్లబ్, వాసవి వనిత గ్రేటర్ క్లబ్, ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేసినారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపాల్ సరళ, ఉపాధ్యాయ బృందం,డిస్టిక్ ట్రెజరర్ నీల సంజీవ్ కుమార్, ఆలంపల్లి పద్మ, ఆర్ సి కొత్త సావిత్రి వాసవి క్లబ్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, కార్యదర్శి, బెల్దే రవీందర్, కోశాధికారి పందిరి వెంకన్న, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మిరపకాయ పొడి పట్టివేత

జయభేరి, వరంగల్ :

వరంగల్ ఏనుమాముల పీఎస్ పరిధిలోని సాయి సిద్ధార్థ్ ఇండస్ట్రీ మిరపకాయల పొడి గ్రైండింగ్ వర్క్స్ పై దాడి జరిగింది. ఈ దాడిలో నిందితుడి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన మిరపకాయ పొడి స్టాక్ ను టాస్క్ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. నిందితుడు బీర్తి సురేశ్ ను స్వాధీనం చేసుకున్న సొత్తుతో పాటు ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జయభేరి, దేవరకొండ :





మునగల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) దేవరకొండలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాలలో డబ్ల్యూ ఈ సి (ఉమెన్స్ ఎంపవర్మెంట్ సెల్) విభాగం ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ..డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ స్త్రీ లేకపోతే మనుగడ అత్యంత క్లిష్టంగా ఉంటుందని స్త్రీలను గౌరవించి పూజించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుకుడాల ఉమామహేశ్వరి (ఫౌండర్ ఆఫ్ గ్రీన్ మ్యారో జూట్ క్రియేషన్స్ దేవరకొండ) మాట్లాడుతూ స్త్రీలు,ఇంట్లో సమాజంలో అనేకమైనటువంటి ఆటుపోట్లు ఎదుర్కొంటారని వాటన్నిటిని అధిరోహిస్తూ, వంటింటికి పరిమితం కాకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాలలోని మహిళా సిబ్బంది అందరిని గౌరవంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, డా.కె.పృథు, డా.కె.రేణుక, డా.ఎం. ప్రభాకర్, డా.వి. మాకట్లాల్, తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కృషి చేస్తుందని వెల్లడి

జయభేరి, సిద్దిపేట జిల్లా, మర్చి 12:



కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా క్షీరసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తు చేశారు.


ఏది ఏమైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని వారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షురాలు విజయమోహన్, వైస్ చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్ గుప్తా,ఆర్ జి పీ ఆర్ ఎస్ అధ్యక్షుడు కడపల్ల నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఏ ఎం సి డైరెక్టర్ ఆదాసు మహేందర్, సర్పంచ్ కే. బాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పరుశరాం, వార్డు సభ్యులు సత్యనారాయణ, ఆనంద్, సీనియర్ నాయకులు నల్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కురుమూర్తి స్వామికి విద్యార్థుల పూజలు

- స్వామివారి పాదాల చెంత హాల్ టికెట్లు ఉంచి పదవ తరగతి విద్యార్థుల పూజలు

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన పుణ్య క్షేత్రమైన చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామిని గురువారం దేవరకద్ర మండలం డోకూర్ తపోవన్ ఉన్నత ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులు పరీక్షల కంటే ముందు హాల్ టికెట్లతో స్వామివారి చెంతకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే పాఠశాలలో పదవ తరగతి చదివి విద్యార్థులు తమ హాల్ టికెట్లను తీసుకొని కురుమూర్తి క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ స్వామివారి పాదాల చెంత హాల్ టికెట్లు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వర్కుటి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రయ్య, శ్రీనివాసులు, పావని, లిఖిత లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నా కౌన్సిలర్

జయభేరి, దేవరకొండ :

భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించి వాడుల్లో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు సూచించి మరుక్షణమే పరిష్కారం చూపిన కౌన్సిలర్ రుప్లా నాయక్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, 16 వ వార్డు దేవరకొండ లో రోల్ మోడల్ గా నిలుపుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర థియేటర్ పరిసరాల పరిశుభ్రతతో పాటు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు, కలిసికట్టుగా పనిచేయాలని సూచించడం జరిగిందన్నారు విద్యోదయ స్కూల్ ఎదురుంగా ఉన్న సందులో డ్రైనేజ్ పారుతుండగా దాన్ని పరిశీలించి ఇకమీద ఇలాంటి పొరపాటు జరగదు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాప్ జెమినీలో 50 వేల ఉద్యోగాలు







**జయభేరి, విశాఖపట్టణం, మార్చి 12 :**

ఏపీలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ క్యాప్‌జెమినీని రాష్ట్రానికి ఆహ్వానించింది. విశాఖపట్నంలో క్యాప్‌జెమినీ గ్లోబల్ సీఈవో ఐమాన్ ఇజ్జత్‌తో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ సమావేశమై కీలక చర్చలు జరిపారు. సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించే సామర్థ్యంతో విశాఖలో ఒక భారీ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ ప్రతిపాదించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో విశాఖపట్నం ఐటీ, డేటా సెంటర్ హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని లోకేశ్ వివరించారు.

దేశంలోనే అతిపెద్దదైన గూగుల్ డేటా సెంటర్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మరో మూడు నెలల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుండటంతో విశాఖకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. ఇక్కడ ఉన్న ప్రత్యేక ఐటీ ఎకోసిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలతో కలిసి ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు కోడెవలప్‌మెంట్ పార్టనర్‌గా వ్యవహరించాలని లోకేశ్ కోరారు. ఏపీలో 'క్వాంటం వ్యాలీ' అభివృద్ధికి, డెడికేటెడ్ క్వాంటం వర్టికల్ స్థాపనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై క్యాప్‌జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్ సానుకూలంగా స్పందించారు. పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 3.4 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, వారిలో 2 లక్షల మంది భారత్‌లోనే ఉన్నారని తెలిపారు. భారత్‌లోని 13 నగరాల్లో తమ కార్యకలాపాలు విస్తరించి ఉన్నాయని వివరిస్తూ, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్యాప్‌జెమినీ ఇండియా సీఈవో సంజయ్ చాకే, డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సీఈవో కేశవ్ మురుగేశ్ కూడా పాల్గొన్నారు. క్యాప్‌జెమినీ సంస్థ వార్షికాదాయం సుమారు 23.9 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం.

# హర్మూజ్ జలసంధి నుంచి భారత్ చేరుకున్న నౌక

**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 12 :**




మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా సౌదీ అరేబియా నుంచి ముడి చమురుతో బయలుదేరిన 'షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్' నౌక సురక్షితంగా భారత్‌కు చేరుకుంది. లిబీరియా జెండాతో, భారత కెప్టెన్ సారథ్యంలో ప్రయాణించిన ఈ ట్యాంకర్ ముంబై పోర్టుకు చేరినట్లు ముంబై పోర్ట్ ట్రస్ట్ వర్గాలు ధృవీకరించాయి. ఏఎన్ఐ వార్తా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది.సౌదీ అరేబియాలోని రాస్ తనూరా పోర్టు నుంచి మార్చి 1న బయలుదేరిన ఈ నౌక, ఇరాన్ అధికారుల అనుమతితో హార్ముజ్ జలసంధిని దాటింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్రమైన ఘర్షణ వాతావరణం కారణంగా ఈ ప్రాంతంలో నౌకల రద్దీ గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇటీవల హార్ముజ్ జలసంధిపై తన పట్టును మరింత బిగించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి ఇటీవల చేసిన హెచ్చరిక అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. "హార్ముజ్ జలసంధిలో సురక్షిత ప్రయాణం సాధ్యమా? ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి వెళ్లాలనుకున్న ఎక్స్‌ప్రెస్ రోమ్, మయూరీ నారీ నౌకల సిబ్బందిని అడగండి. వాటిని మేము స్వాధీనం చేసుకున్నాం. ఇరాన్ అనుమతి లేకుండా ఏ నౌక ముందుకు వెళ్లలేదు" అని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు మద్దతు పలకని దేశాల నౌకలకు మాత్రమే జలసంధి గుండా సురక్షిత మార్గాన్ని కల్పిస్తామని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. ఈ క్రమంలో భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని అందిస్తోంది. ఇరాన్‌ఒమన్ దేశాల మధ్య ఉన్న ఈ జలసంధి ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో ఒకటి. ప్రపంచ చమురు వినియోగంలో ఐదో వంతు, అంటే రోజుకు దాదాపు 2 కోట్ల బ్యారెల్ల ముడి చమురు ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది.ఈ పరిణామాల నేపథ్యంలో భారత పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లో 28 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని, వాటిలో 677 మంది భారత సిబ్బందితో కూడిన 24 నౌకలు హార్ముజ్ జలసంధికి పశ్చిమాన, 101 మంది సిబ్బందితో ఉన్న 4 నౌకలు తూర్పున ఉన్నాయని తెలిపింది. ఫిబ్రవరి 28 నుంచి మంత్రిత్వ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, రాయబార కార్యాలయాలు, షిప్ మేనేజర్లతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు ప్రకటించింది. మధ్యప్రాచ్య సంక్షోభం తీవ్రమవుతున్న తరుణంలో, భారత ఇంధన భద్రతకు అవసరమైన ముడి చమురు దిగుమతులను నిరంతరాయంగా కొనసాగించడంలో ఈ నౌక విజయవంతమైన ప్రయాణం ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్రీన్సెల్ మొబిలిటీ నుంచి మూడు అంబులెన్స్ల అందజేత

**జయభేరి, మేడ్చల్ :**




కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమంలో భాగంగా గ్రీన్సెల్ మొబిలిటీ సంస్థ 'న్యూగో' ఆధ్వర్యంలో మూడు అంబులెన్స్లను అందజేసారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ ట్రాఫిక్ (ADCP)అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై అంబులెన్స్లను లబ్ధిదారులకు అందజేశారు. రామ్ దేవ్ రావు ఆసుపత్రి, కిమ్స్ ఆసుపత్రి, ఫివర్ ఆసుపత్రులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు అంబులెన్స్లను అందజేశారు. సమాజంలో అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చేయడం, కమ్యూనిటీ ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యాలు మాట్లాడుతూ, గ్రీన్సెల్ మొబిలిటీ సంస్థ అంబులెన్స్లను అందజేయడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ అంబులెన్స్ల వల్ల అత్యవసర సమయంలో రోగులను త్వరగా ఆసుపత్రికి తరలించి, సకాలంలో చికిత్స అందించే అవకాశం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు లేదా తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో 'లక్కీ అవర్'లో చికిత్స అందితే రోగి ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఈ సేవల ద్వారా మరింత మందికి ప్రాణ రక్షణ కలిగే అవకాశముందని వారు తెలిపారు.

# తాగిన మత్తులో వీరంగం

**జయభేరి, మేడ్చల్**



ఉప్పల్ బీరప్పగడ్డ లోని శ్రీ విజయ దుర్గ వైన్స్ వద్ద గంజాయి మత్తులో ఎల్లారెడ్డి అనే వ్యక్తి హల్చల్ చేశాడు. హల్చల్ చేస్తూ వైన్స్ వద్ద ఉన్న ఫిష్ అమ్మే వ్యక్తిని, వైన్స్ సిట్టింగ్ లో ఉన్న కస్టమర్ ల వద్ద వీరంగం సృష్టించాడు. బీర్ బాటిల్ పగలకొట్టి సిట్టింగ్ లో ఉన్న వ్యక్తుల వద్ద భయాందోళన సృష్టించాడు. బీర్ బాటిల్ పట్టుకొని వ్యక్తుల పైకి వెళ్తుంటే వైన్స్ వద్ద కనీసం ఆపేవాళ్లు లేకుండా పోయింది. ఎల్లారెడ్డి, మరికొంత మంది గంజాయి బ్యాచ్ సేవిస్తూ జులాయిగా తిరుగుతారని తెలుస్తుంది. విజయ దుర్గ వైన్స్ వద్దకి ఒక్క ఎల్లారెడ్డి మాత్రమే వచ్చి హల్చల్ చేశాడు. ఎల్లారెడ్డి తో పాటు వారి బ్యాచ్ వస్తే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేని పరిస్థితి. వైన్స్ షాప్ యజమానులు, భద్రతపై దృష్టి సారించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వైన్స్ షాప్ చుట్టు ప్రక్కల ప్రజలు చర్చించుకుంటున్నారు. బారును తలపించే విధంగా సిట్టింగ్ ఉండడం వలన శ్రీ విజయ దుర్గ వైన్స్ వద్ద పాదచారులు నడిచే ఫుట్ పాత్ లలో మద్యం ప్రియులు బైక్ లను పార్కింగ్ చేస్తున్నారు.




## విద్యార్థులకు పరీక్షల సామాగ్రి అందజేత

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ కస్తూర్బా స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు స్పాన్సర్స్ పందిరి వెంకన్న జ్యోతి కుమారులు కేదార్నాథ్, స్నేహాళ్ పరీక్షల సామాగ్రి కిట్టు దేవరకొండ ఆదరణ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేసినారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపాల్ సరళ, ఉపాధ్యాయ బృందం సత్యనారాయణ, పందిరి వెంకన్న జ్యోతి ,నీల సంజీవ్ కుమార్, ఆలంపల్లి పద్మ, ఆదరణ సొసైటీ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

**జయభేరి, సికింద్రాబాద్:**

నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులతో పాటు నలుగురు వినియోగ దారులను పోలీసులు అరెస్ట్ చేసారు. వారి నుండి 4.38 లక్షల విలువైన 11.5కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ టాస్కోఫర్స్, చిలకల గూడ సంయుక్త దాడుల్లో నిందితులు పట్టుబడ్డారు. ఒడిశాకు చెందిన సుభాష్ మిషాల్, పవిత్ర బీరా, బాపున్ బిడికిలను రిమాండ్ కు పంపారు. సులభంగా డబ్బులు సంపాదించాలని ఒడిశా నుండి హైదరాబాద్ కు గంజాయిని తరలించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సరఫరా చేస్తున్న ఒడిశాకు కు చెందిన ప్రధాన నిందితుడు మల్లి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

## నేరేడ్మెట్ లో ఎక్సైజ్ సీఐ జ్యోతి భర్త ఆత్మహత్య

**జయభేరి, మేడ్చల్ :**

ఎక్సైజ్ శాఖలో సిఐ గా పనిచేస్తున్న జ్యోతి భర్త శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. జ్యోతి వేధింపులు తన లేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సూసైడ్ రాసాడు. సీఐగా ప్రమోషన్ పొందినప్పటి నుండి తన దగ్గరికి రావడం లేదని తనపై కట్నం వేధింపులకు తో పాటు విడాకుల కోసం దరఖాస్తు చేసుకుందని సూసైడ్ నోట్లో పేర్కొన్నాడు. పోలీస్ స్టేషన్ కి పిలిపించి తనను బెదిరింపులకు పాల్పడేదని సూసైడ్ నోట్లో రాసాడు. వేధింపుల తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్లో పేర్కొన్నాడు.

## తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత

**జయభేరి, మేడ్చల్ :**

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ విలేజ్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించిన రెండేళ్ల చిన్నారి రితీక్షను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోలింగ్ పోలీసులు చిన్నారిని తమ సంరక్షణలోకి తీసుకుని, ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సోషల్ మీడియా సహాయంతో చిన్నారి తల్లిదండ్రులు శ్రీహరి, ఆమెను గుర్తించి పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. ధృవీకరణ అనంతరం చిన్నారిని వారికి అప్పగించారు. చిన్నారి కుత్బుల్లాపూర్లోని బోలా షనేర్ నగర్, పాత శివాలయం సమీపంలో వుంటున్నారు.

## ఔటర్ రింగ్ రోడ్ పై లారీ బోల్తా

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఔటర్ రింగ్ రోడ్డుపై అదుపుతప్పిన లారీ బోల్తా పడింది. ఆ సమయంలో వేరే వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ కి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మృతుని కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 12 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏషబోయిన అంజమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి శ్రీ పలుగుల మైసమ్మ సిఐటియు పెయింటర్ యూనియన్ తరపున 50 కిలోల బియ్యం, గణపతి పెయింటింగ్ షాప్ వినీత్ తరపున 5 కేజీల మంచి నూనెను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేడిపల్లి రాజు, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ గౌడ్, జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, రాజు, సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 12 :**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గజం ఉప్పలయ్య తల్లి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం మాదాపూర్ మాదాపురం గ్రామంలో సిద్దంకి మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన తాటి బెల్లం కాఫీ షాపును ప్రారంభించారు. గొల్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ పాంగల కిష్టయ్య కుమారుని వివాహం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి ,మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి సహాయం అందజేసిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 12:**

తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఓర్సు ప్రమీల కనకయ్య కూతురు కావేరి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి ఆడబిడ్డ పెళ్లికి తమ వంతు 5000 రూపాయల సహాయాన్ని గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పార్వతి చిన్న నాయక్, వార్డు సభ్యులు ఓర్సు రాములు ,నరేష్‌నాయక్, గ్రామస్తులు ఓర్సు ప్రశాంత్, మోత్కుపల్లి రవి, నరేష్‌నాయక్, ప్రవీణ్, కనకయ్య, చంద్రం, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 12 :**

తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భూక్యా సుశీల తండ్రి ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ పరామర్శించారు. అనంతరం రుస్తాపురం గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి బాల్రెడ్డి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనపర్తి లో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక

- **హాజరైన ఎక్సైజ్ శాఖ మంత్రి, దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు**

**జయభేరి, దేవరకద్ర :**

వనపర్తి జిల్లా కేంద్రంలో గురువారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా సర్పంచుల ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే శ్రీ మేఘా రెడ్డి లతో కలసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# చాలా గ్యాప్ తర్వాత మళ్లీ రీఎంట్రీ ఈ ముద్దుగుమ్మ


తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది కామ్నా జెఠ్మలానీ. 2005లో ప్రేమికులు సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీ లోకి అడుగు పెట్టిందీ అందాల తార. బెండు అప్పారావు ఆర్ ఎంపీ, రణం, సామాన్యుడు సినిమాలతో తెలుగులో ఫేమస్ హీరోయిన్ గా బాగా పాపులర్ అయింది. టాస్, కింగ్, సైనికుడు, అందమైన అబద్ధం, రాజాధి రాజా, కత్తి కాంతారావు, యాక్షన్ త్రీడీ, శ్రీ జగద్గురు ఆది శంకర తదితర సినిమాల్లోనూ హీరోయిన్ గానూ, సహాయక నటిగానూ మెప్పించింది. అయితే 2015 చంద్రిక సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకు సినిమా అవకాశాలు కరువయ్యాయి. దీంతో ఇండస్ట్రీకి దూరమైంది. తెలుగుతో పాటు కన్నడ, మలయాళం సినిమాల్లో కూడా నటించిందీ అందాలతార. పెళ్లి, పిల్లల కారణంగా సుమారు ఏడేళ్లు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈ సొగసరి 2022 వ సంవత్సరం లో 'గరుడ' అనే కన్నడ చిత్రం తో రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ పెద్దగా క్లిక్ అవ్వలేదు. ఆ తర్వాత 2023లో వ్యవస్థ, 2024లో నెట్ వర్క్ అనే వెబ్ సిరీస్ ల్లోనూ మెరిసింది కామ్నా జెఠ్మలానీ. ఇక ఈ ఏడాది కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన కే ర్యాంప్ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించిందీ అందాల తార. తన స్క్రీన్ ప్రజెన్స్ తో తెలుగు ఆడియెన్స్ ను మెస్మరైజ్ చేసింది. సినిమా కూడా సూపర్ హిట్ అయ్యింది. దీంతో ఈ ముద్దుగుమ్మకు మరిన్ని సినిమా అవకాశాలు వస్తాయేమో చూడాలి.



# వెంకటేష్ నో చెప్పాడు.. బాలయ్య చేసేశాడు..!


సీనియర్ హీరోలు కూడా కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేసి మెప్పిస్తున్నారు. బాలకృష్ణ, వెంకటేష్, చిరంజీవి, నాగార్జున వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. వెంకటేష్ లాస్ట్ ఇయర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకున్నారు. ఈ సినిమా ఏకంగా రూ. 300కోట్లకు పైగా వసూల్ చేసింది. అలాగే ఈ ఏడాది చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాలో గెస్ట్ రోల్ లో నటించారు. ఈ సినిమా కూడా భారీ హిట్ అయ్యింది. ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమాతో పాటు అనిల్ రావిపూడితో మల్టీస్టారర్ మూవీ చేస్తున్నారు. అయితే వెంకటేష్ ఓ బ్లాక్ బస్టర్ సినిమాకు నో చెప్పాడట.. అదే సినిమా బాలకృష్ణ చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసింది. వెంకటేష్ నో చెప్పిన కథతో బాలకృష్ణ సినిమా చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. నందమూరి అభిమానులకు ఆ సినిమా పూనకాలు తెప్పించింది. ఇంతకూ ఆ సినిమా ఏదో తెలుసా.? ఆ సినిమా మరేదో కాదు సమరసింహారెడ్డి. బీగోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 1999 సంక్రాంతి కానుకగా విడుదలైన సమరసింహారెడ్డి సినిమా ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఫ్యాక్షన్ కథతో తెరకెక్కిన ఈ సినిమా ఆడియన్స్ కు పూనకాలు తెప్పించింది. అంజలా జవేరి, సంఘవి, సిమ్రాన్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసింది. అయితే దర్శకుడు బి. గోపాల్ మొదట ఈ సినిమా కథను వెంకటేష్ కు వినిపించారట. అయితే అప్పటికి వెంకటేష్ ఫ్యామిలీ కంటెంట్ సినిమాలు, లవ్ స్టోరీస్‌తో చేస్తుండటంతో ఫ్యాక్షన్ కథలకు అప్పుడే సిద్ధంగా లేను అని చెప్పారట. అయితే ఫ్యాక్షన్ కథలు, మాస్ యాక్షన్ సిన్ సినిమాలకు బాలకృష్ణ న్యాయం చేస్తారు అని చెప్పి వెంకటేష్ బాలయ్య పేరును సూచించారట. దాంతో బి గోపాల్ బాలకృష్ణకు కథను వినిపించగానే బాలయ్య ఒకే చెప్పారట. అలా వెంకీ నో చెప్పిన కథను బాలయ్య చేసి ఇండస్ట్రీ హిట్ అందుకున్నారు.

# హృతిక్ హీరోగా సౌత్ సినిమా?



గత ఏడాది 'వార్ 2'తో పానిండియా ఆడియన్స్‌ని పలకరించిన హృతిక్ రోషన్.. తర్వాతి ప్రాజెక్ట్‌గా స్వీయ దర్శకత్వంలో 'క్రిష్ 4' చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్తుందా అని ఎదురు చూసిన హృతిక్ అభిమానులకు ఇప్పుడు నిరాశే మిగిలింది. కారణం.. హృతిక్ ప్రస్తుతానికి 'క్రిష్ 4'ను పక్కనపెట్టారట. దానికంటే ముందు మరో ప్రాజెక్ట్‌ని పూర్తి చేయాలని ఆయన నిశ్చయించారట.ఆ వివరాల్లోకెళ్తే. కన్నడ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేసేందుకు హృతిక్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది హృతిక్ చేయనున్న తొలి సౌతిండియా సినిమా కావడం విశేషం. ఈ సినిమా పూర్తి చేసిన తర్వాతే 'క్రిష్ 4'ని పట్టాలెక్కించాలని హృతిక్ భావిస్తున్నారట. ఇక హోంబలే వారితో హృతిక్ చేయబోయే ప్రాజెక్ట్‌కి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

# టాక్సిక్ మూవీలో గ్లామర్ బ్యూటీ..



ప్రస్తుతం మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమాల్లో టాక్సిక్ ఒకటి. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ ఉందన్న సంగతి తెలిసిందే. రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ సైతం కథానాయికగా నటిస్తుంది. ఇదివరకు విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్ ఆకట్టుకున్నాయి. రాకింగ్ స్టార్ యష్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న లేటేస్ట్ మూవీ టాక్సిక్. డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇందులో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తుండగా.. అందులో బాలీవుడ్ తార కియారా అద్వానీ ఒకరు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మోన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దాదాపు 500 కోట్ల బడ్జెట్ తో ఈ చిత్రాన్ని పెద్ద ఎత్తున నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో యష్ సరసన ఏకంగా ఐదుగురు హీరోయిన్ రుక్మిణీ వసంత్, కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియలు నటిస్తున్నారు. అయితే ఇందులో కియారా అద్వారీ స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న కియారా .. ఇప్పుడు టాక్సిక్ సినిమాతో అడియన్స్ ముందుకు రాబోతున్నారు. చాలా కాలంగా ఆమె సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కియారా నదియా అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే విడుదలైన ఫోటోలలో కియారా మరింత అందంగా కనిపిస్తుంది. అయితే ఈ చిత్రానికి ఇప్పుడు కియారా తీసుకునే రెమ్యునరేషన్ గురించి నెట్టింట హాట్ టాపిక్ అయ్యింది. టాక్సిక్ సినిమా కోసం కియారా ఏకంగా రూ.15 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. ఇది ఆమె కెరీర్ లోనే హయ్యేస్ట్ రెమ్యునరేషన్ అని సమాచారం. గేమ్ ఛేంజర్ కోసం దాదాపు 7 కోట్లు వరకు తీసుకుంది. అలాగే వార్ 2 చిత్రానికి రూ.13 కోట్లు తీసుకుంది.

# సమంత 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ'




సినిమాల్లో సూపర్ స్టార్‌గా బిజీగా ఉన్న దశలోనే తన శరీరంలో వచ్చిన మార్పులతో ఒక్క సారిగా షాక్ అయింది సమంత. తనకు వచ్చింది రేర్ డిసీజ్ అని.. అది తన దేహంలో ఉన్న కండరాలను క్షీణించేలా చేస్తుందని తెలుసుకుని ఢీలా పడింది.కానీ కృంగిపోలేదు.. షార్ట్ గ్యాప్‌లోనే తనకొచ్చిన మయోసైటిస్ వ్యాధిపై పోరాటం మొదలెట్టింది. మొక్కవోని విశ్వాసంతో.. ట్రీట్మెంట్, డైట్, వర్కవుట్స్‌తో బౌన్స్ బ్యాక్ అయింది. మళ్లీ క్రమంలోనే తన దినచర్య గురించి డైట్ గురించి.. ఓ ఇంటర్వ్యూలో వివరించింది ఈ బ్యూటీ. దీంతో ఆమె డైట్ కాస్తా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ప్రముఖ ఇంటర్నేషనల్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమంత తన రోజువారీ దినచర్య గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయాన్నే నిద్రలేవడం ఆమెకు అలవాటు. మేల్కొన్న తర్వాత కొద్దిసేపు ప్రార్థనలు చేసుకుని, బయట ప్రకృతిలో సూర్యరశ్మి తగిలేలా కాసేపు గడుపుతుంది. ఆ తర్వాత ధ్యానం చేస్తుంది. ఈ ప్రక్రియ కోసం ఆమె సుమారు ఒకటిన్నర గంటల సమయం కేటాయిస్తుంది. ఈ 'మీ టైమ్' కాన్సెప్ట్ తనను మానసికంగా దృఢంగా ఉంచుతుందని సమంత నమ్ముతోంది. అంతేకాదు సామ్ తన డైట్ గురించి కూడా చెప్పుకొచ్చింది. దాదాపు ఒక సంవత్సరం పాటు తాను ప్రతిరోజూ ఒకే రకమైన కూరగాయలు, చికెన్ వంటకాలను మాత్రమే తిన్నానని చెప్పుకొచ్చింది. మయోసైటిస్ సమస్య ఉన్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు శరీరంలో మంటను పెంచుతాయని.. అందుకే ఎటువంటి రిస్క్ తీసుకోకుండా తన శరీరాన్ని హీలింగ్ చేసుకోవడమే లక్ష్యంగా ఒకే రకమైన ఫుడ్ తీసుకున్నట్టు సమంత చెప్పింది. ఇక ప్రముఖ పోషకాహార నిపుణుడు రయాన్ ఫెర్నాండోతో జరిగిన సంభాషణలో.. సమంత మరిన్ని వివరాలు పంచుకుంది. తాను ప్రస్తుతం 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' డైట్‌ను అనుసరిస్తున్నట్టు చెప్పుకొచ్చింది. చిన్నతనంలో తాను ఏది తిన్నా బరువు పెరిగేదాన్ని కాదని.. , అందుకే ఆహారం విషయంలో అశ్రద్ధగా ఉండేదాన్నంటూ చెప్పుకొచ్చింది. కానీ ఇప్పుడు ఆరోగ్యం అంటే కేవలం బరువు తగ్గడం కాదనే విషయం తనకు తెలిసిందని.. అందుకే తన శరీరం ధర్మాన్ని.. అర్థం చేసుకుని తన డైట్‌లో మార్పులు చేసుకున్నట్టు చెప్పుకొచ్చింది సామ్.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**